సాక్షి
కుమురం భీం

ఆదివారం । 17 । మార్చి । 2024



తాగునీటి కష్టాలు
వాంకిడి మండలం పాతగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎనోలి కొలాంగూడలో వేసవి ప్రారంభంలోనే ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. 9లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:27	సోమ : 5:00

గరిష్టం/కనిష్టం
33.3 /24.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు చాలా వరకు తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. వేడి, ఉక్క పోత కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న సివిల్ జడ్జి కె.యువరాజ

ఆసిఫాబాద్: రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.యువరాజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె. అనంత లక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 16 నుంచి ఇప్పటి వరకు నిర్వహించిన లోక్ అదాలత్‌లో 3 సివిల్ కేసులు, 2,220 క్రిమినల్ కేసులతో పాటు 99,400 ఈ చాలాన్, పీఎల్‌సీ బ్యాంక్ పీఎల్‌సీ కేసులు కలిపి 1,01,623 కేసులు పరిష్కరించామన్నారు.

సిర్పూర్(టి): కక్షిదారులు రాజీమార్గం ద్వారానే తమ కేసులు పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లమ్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులు కోర్టులు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయం వృథా చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కిషోర్‌కుమార్, శంకర్‌రావ్, గణపతి, గంట కళ్యాణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల..సామాజిక ఆస్పత్రి సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని 130 పడకల ఆస్పత్రికి అనుబంధంగా మెడికల్ కళాశాల నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రానికి నిరంతర విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో జనరేటర్‌తో నిర్వహించే పరిస్థితి ఏర్పడిందన్నారు. యంత్రాలు పరికరాలు ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడి సేవలు అందించాలంటే ఆస్పత్రి, కళాశాల మధ్య సమన్వయం ఉండాలన్నారు. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కూశన రాజన్న, దుర్గం దినకర్, కోట శ్రీనివాస్, రాజ్ కుమార్, కార్తీక్, రాజేందర్ పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం

కెరమెరి: వైద్యసేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ముంజం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా కెరమెరి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. రోగులకు సరైన వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారన్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఇద్దరు వైద్యాధికారులను, ముగ్గురు స్టాఫ్ నర్సులను, ఎల్‌టీ, ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో కూటికల ఆనంద్ రావు, చారీ, దొండిబా పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాలలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ వెంకటప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ ప్రవేశం కోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా mjptbcwreis .in వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 12లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 28న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బడికి.. కరెంటు ఫ్రీ

బడులకు విద్యుత్ భారం తగ్గనుంది. ఇటీవల తెల్లరేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు కూడా ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్లు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇప్పటి వరకు ఒక్కో పాఠశాల రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు బకాయిలు ఉన్నాయి. వాటిని ప్రభుత్వమే భరిస్తుందా? లేక మాఫీ చేస్తుందా? అన్న విషయంలో ఇంకా స్పష్టత రాలేదు!!

- పాఠశాలలకు ఇక ఉచిత విద్యుత్
- నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం
- పాఠశాలలకు తప్పనున్న విద్యుత్ భారం



గోయగాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జిల్లా వివరాలు	
ప్రభుత్వ పాఠశాలలు	720
కేజీబీవీలు	15
యూఆర్ఎస్	1
ఎమ్మార్సీలు	15

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ అందిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపాధ్యాయులు స్వాగతిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ సమస్య పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం ఏటా ఇస్తున్న నిధులు సరిపోక విద్యుత్ బిల్లులు చెల్లింపు ప్రధానోపాధ్యాయులకు భారంగా మారింది. జిల్లాలోని అనేక పాఠశాలల్లో రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు పేరుకుపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2,77,22,722, కేజీబీవీల్లో రూ.12,62,834 ఎమ్మార్సీల్లో రూ.5,85,634 విద్యుత్ బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వ ప్రకటనతో ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

అరకొరగా నిధులు

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు ఏటా రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు చెల్లిస్తుంది. రూ.50 వేలు, అంతకన్నా ఎక్కువ నిధులిచ్చే బడులు తక్కువ సంఖ్యలో ఉండగా రూ.25 వేల లోపు నిధులు వచ్చే బడులు ఎక్కువగా ఉన్నాయి. ఈ నిధులు కూడా ప్రభుత్వం రెండు దఫాలుగా విడుదల చేస్తుంది. వీటితో స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, చిన్నచిన్న మరమ్మతులు, నెట్ చార్జీలు, కంప్యూటర్లు, ల్యాబ్‌ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, తాగునీరు, ఇతర సదుపాయాల నిర్వహణకు ఖర్చు చేయాలని నిబంధన ఉంది. ఏడాది పొడవునా పాఠశాలల నిర్వహణకు వివిధ రకాల ఖర్చులు ఉన్నప్పటికీ వారికి సరిపడా నిధులు ఉండడం లేదు. దీంతో కొందరు ప్రధానోపాధ్యాయులు సొంతంగా భరిస్తుండగా కొన్నిచోట్ల దాతలసాయంతో నెట్టుకొస్తున్నారు.

కరెంటు వాడకం పెరుగుతుంది

ప్రభుత్వ పాఠశాలలకు కేటగిరీ 7ఏ కింద విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. బడుల్లో మొక్కలకు ఇతర అవసరాలకు బోరు బావి నీటిని వినియోగిస్తున్నారు. కంప్యూటర్ ప్రయోగశాలలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల గదుల్లో ఫ్యాన్లు, డిజిటల్ తరగతుల ప్రొజెక్టర్లు వంటివి ఉపయోగిస్తున్నారు. మన ఊరు– మన బడి పథకంలో ఎంపికైన పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు అందజేశారు. వీటన్నింటి వినియోగంతో విద్యుత్ బిల్లులు ఎప్పటికప్పుడు పెరుగుతూ వస్తున్నాయి. పాఠశాలల స్థాయిని బట్టి రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు బిల్లులు వస్తున్నాయి. ఆదర్శ పాఠశాలలకు నెలకు రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు వస్తున్నాయి. ఒక్కో ప్రభుత్వ పాఠశాల రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు, ఒక్కో ఆదర్శ పాఠశాల రూ.లక్షకు పైగా పాత బకాయిలు చెల్లించాల్సి ఉందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏటా విద్యుత్ బిల్లుల చెల్లింపు తలనొప్పిగా మారుతోందని వాపోతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇప్పటికే విద్యాధికారులు పాఠశాలలకు సంబంధించిన విద్యుత్ బకాయిల వివరాలపై ఆరా తీశారు.

ప్రభుత్వ నిర్ణయం బాగుంది



కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాగుంది. పాఠశాలలకు చెల్లించే నిధులు సరిపోక విద్యుత్ బిల్లుల చెల్లింపు భారంగా ఉండేది. విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని అధికారులు ఎప్పుడు కనెక్షన్ డిస్‌కనెక్ట్ చేస్తారోనని ఆందోళన చెందుతుండేవాళ్లం. ప్రభుత్వ ప్రకటనతో విద్యుత్ బాధ తప్పినట్లయింది.

– ఆడె ప్రకాశ్, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

నిర్భయంగా పరీక్ష రాయాలి

- 'పది' పరీక్షలకు సర్వం సిద్ధం
- రేపటి నుంచి ప్రారంభం
- జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న విద్యార్థులు 6,637 మంది
- డీఈవో అశోక్



ఆసిఫాబాద్‌రూరల్: పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు ఎలాంటి భయాందోళన చెందకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 37 పరీక్ష కేంద్రాల్లో 6,637 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈసారి మాస్ కాపీయింగ్ లేకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలపై శనివారం ఆయన 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: **జిల్లాలో ఎంత మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరు కానున్నారు? ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.**

డీఈవో: జిల్లా వ్యాప్తంగా 6,637 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఇందులో 212 మంది ప్రైవేట్, 6,425 మంది రెగ్యులర్ విద్యార్థులు ఉన్నారు. బాలికలు 3,492 మంది, బాలురు 3,145 మంది ఉన్నారు. 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. 40 ప్రైవేట్ స్కూళ్లలో 1,193 మంది, 15 కేజీబీవీల్లో 505 మంది, 37 ఆశ్రమ పాఠశాలల్లో 1,119 మంది, 56 ప్రభుత్వ పాఠశాలల్లో 2,255 మంది, 2 మోడల్ స్కూళ్లలో 164 మంది, 5 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 382 మంది, 5 గిరిజన గురుకులాల్లో 340 మంది, 3 మైనార్టీ గురుకులాల్లో 162 మంది, 4 బీసీ గురుకులాల్లో 237 మంది పరీక్షలు రాయనున్నారు.

సాక్షి: **ఈ సారి ఎన్ని పరీక్ష పేపర్లు ఉంటాయి? ఎన్ని మార్కులు ఉంటాయి.**

డీఈవో: ఈ సారి 12 పేపర్లకు బదులుగా 7 పేపర్లు 80 మార్కులు ఉంటాయి. గతంలో జీవశాస్త్రం, రసాయన శాస్త్రం ఒకే పరీక్ష ఉండేది. ఈ సారి వేర్వేరుగా ఉంటుంది. 40 మార్కులకు 90 నిమిషాలు పరీక్ష ఉంటుంది. మిగతా పరీక్షలకు ఉదయం 9:30 నుంచి 12:15 గంటల వరకు పరీక్ష ఉంటుంది. నిమిషం నిబంధనకు బదులుగా ఐదు నిమిషాలు నిబంధన అమలులో ఉంటుంది. విద్యార్థులు అరగంట ముందు పరీక్ష కేంద్రాలకు రావాలి.

సాక్షి: **ఎండ తీవ్రత దృష్ట్యా ఎలాంటి వసతులు కల్పిస్తున్నారు?**

డీఈవో: అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలతో నిఘా ఉంచుతాం. వేసవి నేపథ్యంలో వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు కూడా అందుబాటులో ఉంటారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష సమయంలో అదనంగా బస్సులు నడిపే విధంగా ఆర్టీసీ అధికారుల ఏర్పాటు చేశారు.

సాక్షి: **వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేశారు?**

డీఈవో: జనవరి మాసంలోనే వందశాతం సిలబస్ పూర్తిచేశాం. విద్యార్థులకు ప్రతీరోజు ఒక సబ్జెక్టువైజ్‌గా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాం. వారానికోసారి పరీక్షలు, రెండుసార్లు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశాం. గతేడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలు వస్తాయి.

సాక్షి: **మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?**

డీఈవో: ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. మాస్ కాపీయింగ్ జరగకుండా 37 సిట్టింగ్ స్క్వాడ్, 370 మంది ఇన్విజిలేటర్లు, 2 డిపార్ట్‌మెంట్ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ బృందాలు ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం.

సాక్షి: **విద్యార్థులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?**

డీఈవో: విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు 40 నిమిషాలు ముందుగా రావాలి. భయాందోళన చెందకుండా నిర్భయంగా పరీక్షలు రాయాలి. ఎలాంటి ఒత్తిడికి గురికావద్దు. మంచి ఆహారం తీసుకోవాలి. తగినంత నిద్రపోవాలి. ప్రశ్నపత్రం ఇచ్చిన తర్వాత ముందుగా ప్రశ్నలను అర్థం చేసుకుని జవాబు రాయాలి. అలాచేస్తే మంచి మార్కులు వస్తాయి.

అధికారులు విధులు సక్రమంగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని, ఈ క్రమంలో అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వహిస్తున్న ఫ్లైయింగ్ స్టాటిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, అప్పటి వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి, సరైన ఆధారాలు లేని నగదు, మద్యం, కానుకలు సీజ్ చేసి ట్రెజరీలో భద్రపర్చాలన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలను వీడియోతీసి అట్టి వివరాలను ఎన్నికల ఖర్చుల పరిశీలకులకు అందించాలన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఆదిలాబాద్ కలెక్టర్, ఏఆర్వోలుగా జిల్లా అదనపు కలెక్టర్లు వ్యవహరిస్తారన్నారు. ఎన్నికల ఫిర్యాదుకోసం సీవిజిల్‌యాప్ అందుబాటులో ఉంటుందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎస్పీ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రూ.50వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే వాటికి సంబంధించిన రశీదు తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేశ్ కుమార్, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, కాశబోయిన సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలు చేయాలి

- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ అన్నారు. శనివారం ఢిల్లీ నుంచి ఎన్నికల ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం లోకసభ–2024 కార్యాచరణ విడుదల చేసిన తరుణంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సంబంధిత ప్రచార అంశాలను ఎన్నికల నిబంధనల మేరకు 24 గంటల వ్యవధిలో తొలగించాలని, ప్రచారంలో భాగంగా ర్యాలీలు, సభలు, సమావేశాల నిర్వహణ కొరకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతి పొందాలన్నారు. ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందని, 25 వరకు అభ్యర్థుల నామినేషన్లు దాఖలు, 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటాయన్నారు. జూన్ 6న ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని, అప్పటి వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందన్నారు. భారత ఎన్నికల సంఘం గుర్తించబడిన 12 రకాల గుర్తింపు కార్డుల ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమర్థవంతమైన ఎన్నికల నిర్వహణ కొరకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఎస్పీ సురేశ్ కుమార్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, కాశబోయిన సురేశ్, జిల్లాలోని ఎన్నికల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన వీడితే అద్భుత ఫలితాలు

- పదో తరగతి విద్యార్థులకు నిపుణుల సూచనలు
- మెలకువలు పాటిస్తే ఉన్నత గ్రేడులు సొంతం

కెరమెరి(ఆసిఫాబాద్): పదో తరగతి విద్యార్థుల్లో ఆందోళన కలగడం సహజమే. కానీ ఆత్మవిశ్వాసంతో భయం వీడి పరీక్షలు రాస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు చిన్నచిన్న తప్పిదాలతో ఒక్కమార్కు తేడాతో 10 జీపీఏను కోల్పోవాల్సి వస్తుంది. ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎక్కువ మంది విద్యార్థులు చేసే తప్పిదాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు.

విద్యార్థులు చేసే తప్పిదాలు

దాదాపు 75 శాతం మంది విద్యార్థులు ప్రశ్నపత్రాన్ని తీసుకుని ఐదు నిమిషాల్లోనే జవాబులు రాయడం మొదలు పెడతారు. కానీ ఇది సరికాదు. ముందుగా ప్రశ్నలను చదివి అర్థం చేసుకున్న తర్వాతే సమాధానాలు రాయాలి.

- సమాధానాలు ప్రశ్నలతో కూడిన బుక్‌లెట్‌లో ప్రతీపేజీకి ఎడమవైపు 2–2.5 సెంటి మీటర్ల మార్జిన్ వదలాలి.
- ప్రశ్నపత్రంలో బాగా ఏ ప్రశ్నకైనా ముందుగా జవాబు రాయవచ్చు. ఆ ప్రశ్న నంబర్‌ను ఎడమవైపు మార్జిన్‌లో తప్పక వేయాలి. ప్రశ్నల నెంబర్లు తప్పుగా వేయడం, మర్చిపోవడం చేయవద్దు.
- ఎరుపు సిరా పెన్నులు నిషేధం. నీలం, నలుపురంగు సిరా మాత్రమే వాడాలి.
- పెద్దపెద్ద అక్షరాలతో మరీ ఎక్కువ మార్జిన్ వదిలి భారీగా పేజీలు నింపితే ప్రయోజనం శూన్యం. దిద్దేటప్పుడు ఉపాధ్యాయులు అసహనానికి లోనవుతారు.
- జవాబులు వ్యాసంలా కాకుండా పాయింట్ల రూపంలో రాయాలి.
- రాయాల్సినవి పూర్తయ్యాకే ఐచ్ఛిక ప్రశ్నలు మొదలు పెట్టాలి.
- బిట్ పేపర్‌లో కొట్టి వేతలు, దిద్దివేతలు లేకుండా చూసుకోవాలి.
- 10 నుంచి 15 నిమిషాల ముందే పరీక్ష రాయడం పూర్తి చేయాలి

సబ్జెక్టుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తెలుగు, హిందీ, ఇంగ్లిషు వ్యాకరణం ముఖ్యమైంది. అక్షర దోషాలు లేకుండా జాగ్రత పడాలి.
- గ్రాఫులు, పటాలు, పెన్సిల్‌తోనే గీయాలి.
- భౌతిక శాస్త్రంలోని సమస్యలు ప్రమాణాలను రాయడం మరవద్దు.
- జీవశాస్త్రంలో ప్రయోగాలకు సంబంధించి చిత్రాలు గీయాలి.
- సాంఘికశాస్త్రంలో సమకాలిన అంశాలు, నిత్య జీవిత ఉదాహరణలు అన్వయిస్తూ రాయాలి.
- 2 మార్కుల ప్రశ్నలకు మూడు, నాలుగు వరుసల్లో, 4 మార్కుల ప్రశ్నలకు ఐదు వరుసల్లో, 6 మార్కుల ప్రశ్నలకు ఎనిమిది నుంచి పది వరుసల్లో సమాధానం రాయాలి.



గోయగాంలో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

ఉన్నత చదువులకు తొలిమెట్టు



ఉన్నత చదువులకు పదో తరగతి తొలిమెట్టు. వార్షిక పరీక్షల్లో పొరపాట్లు చేస్తే విద్యార్థులకు నష్టం. ఆందోళన చెందకుండా పరీక్ష రాయాలి. ఎక్కువ మార్కులు సాధిస్తే విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగం.

– ప్రవీణ్ కుమార్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్, గోయగాం

బీఆర్ఎస్ గెలుస్తుందన్న భయంతోనే అరెస్టు

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుస్తుందన్న భయంతోనే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. లిక్కర్ కేసులో ఈడీ అధికారులు శుక్రవారం కవితను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, పీఎం మోదీ చోటా భయ్యా.. బడా భయ్యా మాదిరి వ్యవహరిస్తూ ములాఖత్ అయ్యారన్నారు. కేసీఆర్ కుటుంబం ఉద్యమం సమయంలో అనేక కేసుల్లో జైలుకు వెళ్లిందని, వారికి జైలు కొత్త కాదన్నారు. బెదిరింపులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. కవితపై కేసులు ఎత్తివేసి భేషరతుగా విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ద్రుపదాబాయి, ఎంపీపీలు సౌందర్య, మోతీరాం, నాయకులు సరస్వతి, శ్రీనివాస్, అలీబిన్ హైమద్, సొంగ్డె జీవన్, నిస్సార్, తదితరులు పాల్గొన్నారు.

'ఏనుగు' పార్టీలో అయోమయం !

- 'ఆర్ఎస్పీ' రాజీనామాతో సందిగ్ధంలో కేడర్
- బీఆర్ఎస్‌లో చేరుతారనే ప్రచారం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్(ఆర్ఎస్పీ) ఆ పార్టీని వీడడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆయన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. బహుజనవాదంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఒక దశలో ఆయన గెలుస్తారనే ధీమా కేడర్‌లో నింపారు. కానీ ఆయన మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఆ తర్వాత కూడా పలుమార్లు సిర్పూర్ నియోజకవర్గానికి వచ్చారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు తెరపైకి రావడం తెలిసిందే. దీంతో నియోజకవర్గంలో తన ఓటమికి కారణమైన ఆర్ఎస్పీతో పొత్తును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోనేరు కోనప్ప తన సోదరుడు జెడ్పీ చైర్‌పర్సన్ కృష్ణారావు, నాయకులతో సహా కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ వీడడంతో బీఆర్ఎస్‌లో చేరుతారనే ప్రచారం మొదలైంది. దీనిపై ఆర్ఎస్పీ ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

బలం పెరిగి, బలహీన పడి..

రాష్ట్రంలో బీఎస్పీకి అధ్యక్ష హోదాలో మాజీ ఐపీఎస్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఉండడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీకి ఆదరణ ఉంటుందని కేడర్‌లో నమ్మకం పెరిగింది. ఆయన పోటీ చేసిన స్థానంలోనైనా గెలుస్తారనే నమ్మకం కల్పించారు. ఇందుకోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ పార్టీ బలోపేతం చేయాలని అసెంబ్లీ ఎన్నికల ముందు తీవ్రంగా శ్రమించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం కోస్నిలోనే నివాసం ఏర్పర్చుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని పది స్థానాల్లో తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో దింపారు. 2014లో నిర్మల్ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సిర్పూర్‌లో కోనేరు కోనప్ప బీఎస్పీ నుంచే పోటీ చేసి ఏనుగు గుర్తుపైనే గెలిచారు. అదే నమ్మకంతో సిర్పూర్‌లో ఆర్ఎస్పీ బరిలోకి దిగారు. సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ కార్యదర్శిగా పని చేసిన పరిచయాలు, 'స్వేరో' సైన్యం, దళిత, బీసీ, మైనార్టీల మద్దతుతో పార్టీని బలోపేతం చేశారు. చాలామంది మాజీ ఐపీఎస్ పిలుపుతో పార్టీలో చేరారు. గత ఎన్నికల్లో ఆశించిన తీరులో పార్టీ ఫలితాలు రాకపోవడంతో కేడర్ నిరాశ చెందారు. తాజాగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్, పెద్దపల్లి నుంచి ఆశావహులు పోటీలో ఉంటారని ప్రణాళికలు వేస్తున్నారు. అయితే పార్టీ అధ్యక్షుడి రాజీనామాతో ఏం చేయాలనే సందిగ్ధంలో పడ్డారు. కొంతమంది పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉండగా, మరోవైపు బీఎస్పీలోనే కొనసాగేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇంకుడుగుంతలపై నిర్లక్ష్యం..

- ఇంటి నిర్మాణ అనుమతులకే పరిమితం..
- ఇంటి యజమానులు, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం
- మున్సిపాలిటీల్లో కానరాని ఇంకుడు గుంతల నిర్మాణాలు

మంచిర్యాలటౌన్: ఇంటి అనుమతుల సమయంలోనే ఇంకుడుగుంతల నిర్మాణం చేపడతామని అనుమతులను తీసుకుని, ఆ తరువాత వాటిని నిర్మించకుండానే ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీలో ప్రతి యేటా 600లకు పైగా కొత్త ఇంటి నిర్మాణాలు చేపడుతుండగా, ఇంటి నిర్మాణం అనుమతి తీసుకునే సమయంలోనే ఇంకుడుగుంతలను నిర్మిస్తామని, మున్సిపాలిటీకి డబ్బులను చెల్లిస్తున్నారు. ఇంటి నిర్మాణంతో పాటు, ఇంకుడుగుంతల నిర్మాణ పనులను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించకపోవడంతో ఇంటి యజమానులు ఇంకుడుగుంతలను నిర్మించకుండానే ఇళ్లను కడుతున్నారు. తగ్గిపోతున్న భూగర్భ జలాలను పునరుద్ధరించే దిశగా పట్టణ ప్రాంతాల్లో వర్షం ఆధారంగా అందుబాటులోని నీటిని తిరిగి భూమి పొరల్లోకి పంపి నిల్వ చేసేందుకు పట్టణ ప్రగతి కార్యక్రమంలో ప్రాధాన్యం ఇచ్చారు. అందులో భాగంగా జల్‌శక్తి అభియాన్ పేరుతో ఇంకుడుగుంతలను నిర్మించేందుకు చర్యలను చేపట్టినా, దానిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

నిర్లక్ష్యంతోనే....

ఇంకుడు గుంతలను నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలను జారీ చేస్తున్నా, ఆ దిశగా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ముందుకు సాగడం లేదు. అయితే ఇంటి నిర్మాణ సమయంలోనే ఒక్కో ఇంకుడుగుంత నిర్మాణానికి రూ.2,500 సైతం మున్సిపాలిటీకి చెల్లిస్తున్నారు. వీటిని నిర్మిస్తున్నారా లేదా అని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించాలి. నిర్మాణం పూర్తయిన తరువాత తిరిగి ఆ డబ్బులను నిర్మాణదారుడికి ఇవ్వాలి. మూడేళ్లుగా మంచిర్యాల మున్సిపాలిటీలో 1600లకు పైగా ఇళ్లను నిర్మించగా కేవలం 102 ఇంకుడు గుంతలను మాత్రమే నిర్మించారు.

బల్దియాలో శూన్యం..

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో 16328 ఇళ్లు ఉన్నప్పటికీ ఇంకుడుగుంతల నిర్మాణాలు ఏ ఒక ఇంటి వద్ద కూడా కానరావడం లేదు. ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చే క్రమంలో తప్పక ఆ ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మాణం చేశారో లేదో పర్యవేక్షించాల్సి ఉండగా ఆ దిశగా మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేదనే విమర్శలున్నాయి. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. కొన్ని వార్డుల్లో ఇటీవల కొత్తగా ఇళ్ల పట్టాలు జారీ చేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టినా మున్సిపల్ పరంగా ఇంకుడుగుంత కట్టుకోవాలనే అవగాహన కల్పించడంలో నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. ఇక ప్రభుత్వ, సింగరేణి లీజు భూములను ఆక్రమించుకుని అనుమతి తీసుకోకుండానే రాత్రికి రాత్రే ఇల్లు కడుతున్నారు. దీంతో ఇంకుడు గుంత ఊసే కానరావడం లేదు. ఈ కారణంగా మున్సిపల్ లెక్కల్లో ఇంకుడుగుంతల గణాంకాలు లేకుండా ఉన్నాయి.



మంచిర్యాల మున్సిపాలిటీలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న అప్పటి ఎమ్మెల్యే (ఫైల్)

కానరాని నిర్మాణాలు..

నస్పూర్: పట్టణ పరిధిలో ప్రజలు తమ ఇళ్ల ఎదుట ఎక్కడా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టడం లేదు. పట్టణంలో నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు తప్పనిసరిగా ఇంకుడు గంతలు ఏర్పాటు చేస్తేనే ఇంటి నిర్మాణాలకు అనమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ సంబంధిత అధికారులు ఆ దిశగా క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఇంకుడుగుంతలతో భవిష్యత్‌లో కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పిస్తే ప్రజల్లో మార్పు వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

క్యాతనపల్లిలో..

రామకృష్ణాపూర్: ఇంటి నిర్మాణాల అనుమతులకు సంబంధించి ఇంకుడుగుంతల ఏర్పాటు నిబంధన తప్పనిసరి కాగా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మాత్రం ఇంకుడుగుంతల నిర్మాణాలు కానరావటం లేదు. ప్రతీ 200 చదరపు అడుగుల పైబడి ఇంటి నిర్మాణాలకు ఇంకుడుగుంత ఏర్పాటు నిబంధన ఉండగా ఇక్కడ మాత్రం అది ఎవరూ పాటించటం లేదు. గతంలో గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన 380 వరకు ఇంకుడుగుంతలు తప్పించి మున్సిపాలిటీ అయిన పిమ్మట ఇంకుడుగుంతల నిర్మాణాలేవి పెద్దగా చేపట్టినట్లు లేవని అధికారులే చెబుతున్నారు.

కొరవడిన అవగాహన

చెన్నూర్: ప్రజల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కొరవడింది. గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో ఉపాధి హామీలో ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టారు. మున్సిపాలిటీగా ఏర్పాటైన తర్వాత ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టలేదు. అధికారులు పర్యక్షణ లోపం కారణంగా నిర్మాణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. అతిగా మద్యం సేవించి పడిపోయి మృతి చెందినట్లుగా ఉందని, సదరు వ్యక్తి తరుచుగా మద్యం తాగి తిరుగుతుండేవాడని స్థానికులు చెబుతున్నట్లు తెలిపారు. మృతుడికి సుమారు 30 ఏళ్లు ఉంటాయని, మృతుడి శరీరంపై బూడిద రంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి



హాల్ టికెట్లను అందిస్తున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: టెన్త్ వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి తెలిపారు. శనివారం సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష రాయబోతున్న 67 మంది విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించాలన్నారు. సింగరేణి పాఠశాల నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. పూర్వ విద్యార్థులు సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ, ఎగ్జామ్ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేశ్వర్, హెడ్మాస్టర్ రాధాకృష్ణమూర్తి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, శ్రావణి, కావ్య, మంగ పాల్గొన్నారు.

ఆటో దొంగలు అరెస్ట్



ఆటోలు, పట్టుబడిన దొంగలతో పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఆటోలను దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బన్సిలాల్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక భగవంతంవాడకు చెందిన మేడా శ్రావణ్‌కు చెందిన ప్యాసింజర్ ఆటో ఈ నెల 15న రాత్రి చోరీకి గురైందని ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా శనివారం సాయంత్రం సున్నంబట్టి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అశోక్‌రోడ్‌కు చెందిన అనుముల శ్రీధర్, సప్తగిరికాలనికి చెందిన వెంగల శ్యామ్‌కుమార్‌లు ఆటోలో పారిపోతుండగా పట్టుకున్నారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా రెండు రోజుల క్రితం మరో ఆటో సైతం దొంగలించినట్లు ఒప్పుకున్నారు. రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

108లో ప్రసవం



శిశువుతో సిబ్బంది, కుటుంబీకులు

భీమిని: మండలంలోని అక్కళ్లపల్లి గ్రామానికి చెందిన రెడ్డి మహేశ్వరి నిండు గర్భిణి. పురుటి నొప్పులు రావడంతో శనివారం 108కు సమాచారం అందించారు. వాహనంలో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించే క్రమంలో రాంపూర్ గ్రామ సమీపంలోకి నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది సుఖప్రసవం చేయగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ప్రభుత్వాస్పత్రికి తల్లి, బిడ్డలను తరలించగా ఇరువురు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ తాహీర్‌పాషా, పైలెట్ ఖలీల్ అహ్మద్ తెలిపారు.

టవరెక్కిన కార్మికుడు

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో పనిచేస్తున్న పి.మధు అనే కాంట్రాక్టు కార్మికుడు తన పీఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జైపూర్‌లో టవరెక్కాడు. సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీలో ఆరేళ్లుగా పని చేస్తున్నప్పటికీ పీఎఫ్ డబ్బులు చెల్లించడం లేదని, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని, తన పీఎఫ్ డబ్బులు చెల్లించాలని టవర్ ఎక్కాడు. గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు పవర్‌మేక్ కంపెనీ అధికా రులకు తెలుపగా వారు సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడితో మాట్లాడి ఆయన సమస్య పరిష్కరిస్తానని నచ్చజెప్పడంతో కిందకు దిగాడు.

సంక్షేమానికి వెనుకాడం

- డైరెక్టర్ యన్‌వీకే శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఉద్యోగుల సంక్షేమానికి ఎంత ఖర్చు అయినా వెనుకాడమని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్) ఎన్‌వీకే శ్రీనివాస్ తెలిపారు. శనివారం సీసీసీలో నూతనంగా 30 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.16 కోట్లతో ఈ రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. దీని ద్వారా కార్మిక కుటుంబాలకు పరిశుద్ధమైన తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఇలాంటి తాగునీటి శుద్ధి విధానం అభివృద్ధి చెందిన దేశాల్లో మాత్రమే ఉందని, నేడు సింగరేణి ఈ విధానంతో తాగునీటిని అందించబోతుందన్నారు. సింగరేణి కార్మికులు ఆరోగ్య పరిరక్షణ కోసం కంపెనీ అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ రాజకుమార్, అధికారుల సంఘం కేంద్ర కార్యదర్శి నరసింహులు, ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, జనరల్ మేనేజర్ (సివిల్) సూర్యనారాయణ, ఏరియా ఎస్ఓటూ జీఎం పురుషోత్తం రెడ్డి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్ కుమార్, ఏజెంట్ రాముడు, ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్ రావు, సీనియర్ సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) సత్యనారాయణ పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

కుక్కల దాడిలో చుక్కలదుప్పి హతం

కోటపల్లి: మండలంలోని మల్లంపేట గ్రామంలో కుక్కల దాడిలో చుక్కల దుప్పి తీవ్రంగా గాయపడి మృత్యువాత పడింది. శనివారం చుక్కలదుప్పి నీటి కోసం గ్రామానికి సమీపంలోకి రాగా గమనించిన ఊరకుక్కలు చుక్కలదుప్పిని వెంబడించి తీవ్రంగా గాయపర్చగా గమనించిన గ్రామస్తులు చుక్కల దుప్పికి ప్రాథమిక వైద్యం అందించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకుని చుక్కల దుప్పిని నీల్వాయి రేంజ్‌కు తరలించి చికిత్స అందించగా మృతి చెందినట్లు రేంజర్ ఇక్బాల్ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కళేబరాన్ని ఖననం చేశారు. రెండు నెలల వ్యవధిలోనే రెండు చుక్కల దుప్పులు మరణించడంపై జంతుప్రేమికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అటవీ అధికారులు నిర్లక్ష్యం వీడి వన్యప్రాణుల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.



తీవ్రంగా గాయపడిన చుక్కల దుప్పి

స్వేచ్ఛగా పరీక్ష రాసేద్దాం



పాఠశాలలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

- రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఒత్తిడి అధిగమిస్తే విజయం మీదే..
- ఆశావహ దృక్పథంతో హాజరుకండి..
- విద్యారంగ నిపుణులు, విజేతలు, మనోవికాసవేత్తల మాట

నిర్మల్‌ఖిల్లా: పరీక్షలు, మార్కులు జీవితానికి పరమావధి కాదు. అయినా చదువుతో సమాజంలో మంచి స్థానం లభిస్తుంది. పాఠశాల స్థాయి దాటేందుకు వారధిలాంటి పదో తరగతి పరీక్షలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే తొలిసారి బోర్డు పరీక్షలు రాయనున్న విద్యార్థులు కొంతమేర ఒత్తిడి, ఆందోళన సహజంగానే ఉంటుంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలకు హాజరైతే ఆకాశమంత ఆత్మవిశ్వాసం కలిగి ఉత్తమ ఫలితాలు రాబట్టవచ్చని అంటున్నారు. ఏడాదంతా నేర్చుకున్న చదువును ప్రదర్శించేందుకు ఇదొక మంచి అవకాశంగా భావించాలని విద్యారంగ నిపుణులు, విజేతలు, మనోవికాసవేత్తలు సూచిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం...


మరికొన్ని ముఖ్య సూచనలు...

- విద్యార్థి తెలివితేటలను హరించి వేసేది ఒత్తిడి. మొదట ఒత్తిడిని దరిచేరనీయవద్దు. ఈ పరీక్షలు కేవలం పైతరగతులకు వెళ్లేందుకే ఉద్దేశించినవనే ధోరణితో పరీక్షలకు హాజరు కావాలి.
- పరీక్షలే జీవిత సర్వస్వం కాదని గుర్తించాలి. నమ్మకమే మనిషిని నడిపిస్తుంది. విజయం సాధించేందుకే మనమున్నామనే బలమైన ఆశావహ దృక్పథాన్ని కలిగి ఉంటే విజయానికి బాటలు వేస్తుంది.
- విద్యార్థులకు 10/10 రావడం ఒక్కటే జీవితంలో ప్రధాన లక్ష్యం కాదని గుర్తించాలి. ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో గుర్తించి ఆ విషయంలో ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి.
- పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన వాటిని సమకూర్చాలి.

8923 మంది విద్యార్థులు...

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అయితే నిర్మల్ జిల్లాలో దాదాపు 8,923 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షలను ఆశావాహ దృక్పథంతో, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటే మంచి ఫలితాలను అలవోకగా సాధించవచ్చని విద్యావేత్తలు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


ఆందోళన జయిస్తే గెలుపు మీదే...



విద్యార్థులకు సమయపాలన చాలా ముఖ్యం. చేయగలిగే లక్ష్యాలను మాత్రమే ఎంచుకోవాలి. ప్రశ్న పత్రంలో కూడా అదే విధంగా తగిన ప్రశ్నలకు సమాధానాలు ఎంచుకున్న తర్వాత వాటి సమాధానాలను రాస్తూ వెళ్లే క్రమంలో ఏదైనా మర్చిపోతే అక్కడే ఆగిపోకుండా ముందుకెళ్లాలి. పరీక్షల సమయంలో తగిన నిద్ర ఉంటేనే చదువుకున్నది గుర్తుంటుంది. అందుకే ప్రతిరోజు దాదాపు 6 నుండి 8 గంటలు పడుకోవాలి. ప్రణాళిక ప్రకారం చదువుకోవాలి. పరీక్షలను సరిగా రాయలేకపోతున్న విద్యార్థులు కృంగిపోవాల్సిన అవసరం లేదు. చదివే సర్వస్వం కాదు. తల్లిదండ్రులు పిల్లలను చదువు పట్ల ఎక్కువ ఒత్తిడి చేయవద్దు.

– భూమన్న యాదవ్, మనోవికాస నిపుణులు, మోటివేషనల్ స్పీకర్, నిర్మల్


పాఠశాలల్లో రాసే పరీక్ష లాంటివే..



విద్యార్థులకు పరీక్షల రాయడం కొత్త కాదు. ఏడాదంతా నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక పరీక్షలు రాస్తూనే ఉంటారు. కాకపోతే ఇతర పరీక్ష కేంద్రంలో రాస్తున్నామని భయం వారిని తొలచివేస్తుంది. ఆ భయాన్ని వీడాలి. క్రమశిక్షణతో కూడిన కార్యాచరణను అమలుపరిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయి. మన భవిష్యత్ కోసం మనం కష్టపడుతున్నామనే భావనను పెంపొందించుకొని కాలక్షేపం వంటి వాటికి దూరంగా ఉండాలి. టీవీ, మొబైల్ ఫోన్ వంటి వాటితో సమయాన్ని వృథా చేయవద్దు. ప్రిపరేషన్ సమయంలో మధ్య మధ్యలో స్వల్ప విరామం ఇవ్వాలి. పరీక్ష సమయానికి కనీసం రెండు గంటల ముందు చదవడం ఆపేసి ప్రశాంతంగా గడపాలి.

– డాక్టర్ బి.సాయిప్రసన్న, ఎంబీబీఎస్ వైద్య విద్యార్థిని, చించోలి–బి.

ఆశావహ దృక్పథం అవసరం..



ఒక పరీక్ష రాశాక దాని గురించి పూర్తిగా మర్చిపోవాలి. విద్యార్థుల దృష్టి తర్వాతి రోజు రాయనున్న పరీక్షపైనే కేంద్రీకరించాలి. ఫలానా ప్రశ్నకు సమాధానాన్ని సరిగా రాయలేదని భావనను మనసులోనికి రానీయకూడదు. మార్కుల గురించి ఆలోచనలు వదిలివేయాలి. ప్రశాంతంగా ఉంటేనే మెదడు చురుకుగా పనిచేస్తుంది. మధ్య మధ్యలో కాస్త విరామం ఇస్తూ సాధన చేయాలి. బాగా రాయదగిన అంశాలను ముందుగా ఎంచుకొని సమాధానాలు రాయడం ఉత్తమం. చేతిరాత బాగుండేలా సాధన చేయాలి. ప్రతిరోజు తగిన మోతాదులో దాదాపు 6 నుండి 8 గ్లాసుల నీళ్లు తాగాలి.

–రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

నూతన నియామకం



శ్రీనివాస్‌కు నియామక పత్రం ఇస్తున్న జనక్‌ప్రసాద్

తాండూర్: ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడిగా మాదారం టౌన్‌షిప్‌కు చెందిన పేరం శ్రీనివాస్ ఎంపికయ్యారు. 46మందితో కూడిన బెల్లంపల్లి ఏరియా కమిటీని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ శనివారం ప్రకటించారు. ఇప్పటివరకు ఏరియా ఉపాధ్యక్షుడిగా ఉన్న పేరం శ్రీనివాస్‌ను మరో మారు కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఏరియా కార్యదర్శులుగా కృష్ణ, సదానందం, జిపి చంద్రకుమార్, సోకాల శ్రీనివాస్, బూర శ్రీనివాస్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మాసాడి నారాయణ, గోళం గట్టయ్య, కోశాధికారిగా బోడ తిరుపతితో పాటు ఎనిమిది మందిని సంయుక్త కార్యదర్శులుగా, పది మంది ఆర్గనైజింగ్ కార్యదర్శులు, 18 మంది ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందజేశారు.

ఉద్యోగి ప్రాణం తీసిన వేధింపులు!

- చికిత్స పొందుతూ టెక్నికల్ ఆఫీసర్ మృతి
- ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు



రాకేష్ (ఫైల్)

జన్నారం: సెలవుల విషయంలో వేధింపులు ఓ ఉద్యోగి ప్రాణం తీశాయి. మనస్తాపంతో పురుగుల మందు తాగగా.. చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మృతుడి తల్లి సరస్వతి, ఎస్సై సతీష్ వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కడెం నీటి పారుదల శాఖ కార్యాలయంలో మండల కేంద్రానికి చెందిన తోకల రాకేష్ (37) టెక్నికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. అతడి తండ్రి మూడు నెలల క్రితం చనిపోయాడు. సెలవుల విషయంలో అదే కార్యాలయంలో పని చేస్తున్న సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ వేధింపులకు గురిచేశారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. ఇటీవల రాకేష్ తండ్రి మూడు నెలల కర్మ కోసం సెలవు అడగడంతో వారు దుర్భాషలాడారు. దీంతో మనస్తాపం చెందిన రాకేష్ గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా శనివారం తెల్లవారుజామున చనిపోయాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యంత్రాల వినియోగాన్ని పెంచాలి



షావెల్‌ను ప్రారంభిస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): గనుల్లో యంత్రాల వినియోగాన్ని, పనితీరును మెరుగుపర్చుకుంటూ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలను సాధించాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్ అన్నారు. ఏరియాలోని కై రిగూడ ఓసీపీలో రూ.1.5కోట్ల విలువైన మూడు క్యూబిక్ మీటర్ల సామర్థ్యపు నూతన షావెల్‌తో పాటు, రూ.19.5 లక్షల విలువైన నూతన డీజిల్ బోసర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసీపీల్లో అధిక బొగ్గు ఉత్పత్తి కోసం యాజమాన్యం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలను సమకూరుస్తోందన్నారు. యంత్రాల వినియోగాన్ని, పనితీరును మెరుగుపరుస్తూ అధిక బొగ్గు ఉత్పత్తికి ఉద్యోగులందరూ కృషి చేయాలని అన్నారు. యంత్రాల పని గంటలను పూర్తి సామర్థ్యంతో వినియోగించటం ద్వారా బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గుతుందని తెలిపారు. యాజమాన్యం అందిస్తున్న నూతన యంత్ర పరికరాలతో కైరిగూడ ఓసీపీలో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతలను సాధించాలని సూచించారు. అనంతరం వేసవి ఉపసమన చర్యల్లో భాగంగా ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లను అందచేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం నరేందర్, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజినీరు వీరన్న, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అదికారి రాజేశ్వర్ రావు, డీవైపీఎం వేణు, ఇంజనీర్లు నరేష్, మహేష్, బాలయ్య, చుక్కయ్య, శంకర్‌లు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నాలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట శనివారం ఏరియా ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఏరియా గౌరవ అధ్యక్షుడు ఓదెలు మాట్లాడుతూ ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల్లో కొత్త వారి నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెషనల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని, రెండు జతల యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏరియాలో 124 పోస్టులు ఉండగా యాజమాన్యం వాటిని 117కు కుదించిందని అయినప్పటికీ యాజమాన్యం ప్రకటించిన పోస్టుల కంటే 47 మంది సెక్యూరిటీ గార్డులు అదనంగా పని చేస్తున్నారన్నారు. దీంతో మాస్టర్లు తగ్గి కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. సింగరేణిలో ఎక్కడ లేని విధంగా ప్రొఫెషనల్ ట్యాక్స్ పేరులో కేవలం బెల్లంపల్లి ఏరియాలోనే ఒక్కో సెక్యూరిటీ గార్డు నుండి రూ. 150 కోత విధిస్తున్నారని తెలిపారు. అనంతరం ఏరియా జీఎం రవి ప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో సెక్యూరిటీ గార్డులు జాక్సన్, రాజశేకర్, యూసిఫ్, కరుణాకర్, రవికుమార్, మోహన్, దామోదర్, నాగేష్, గణపతి, సతీష్ పాల్గొన్నారు.